అర్ధాంగి అలుక

సాయంత్రమైంది. శాబోటివారిని యిక సెలవుతీసుకుని ఇళ్లకుపొండని ఆదేశిస్తున్నట్లుగా పుష్యమాసపు సూర్యుడు క్రిందకు జారిపోతున్నాడు. ఆఫీసునుంచి బయటపడి యింటివైపు నడక సాగించాను. శీతాకాలం అవటం మూలాన బాగా ప్రొద్దుగూక్క పోయినా చలి విదరిస్తూనేవుంది. ఆడవాళ్లు సాయంత్రపు వంటలు ప్రారంభించారు కాబోలు, ఇళ్లలోనుంచి సన్నగా పొగ బయటకువస్తోంది. రేపు ఆదివారం. సెలవు రోజున యేంచెయ్యాలో కార్యక్రమాన్ని వూహించుకుంటూ వెళ్తున్న నాకాళ్లు అలవాటుచొప్పున నా ప్రమేయం లేకుండానే పూల అంగడివద్ద ఆగిపోయాయి. అనేక రకాల పూలు అక్కడ అమ్మబడుతున్నా విజయకు ప్రియమైన సన్నజాజిపూలు మాత్రమే నేను రోజూ వాడికగా తీసుకుంటాను. రోజులాగ మామూలు పూలకు డబ్బులిస్తున్న నాకు పూల సాయిబు "ఈ వేళ శనివారం బాబూ!" అన్నాడు. శనివారంనాడు మరికొన్ని పూలు యెక్కువ తీసుకోవటం నా కలవాటు. శనివారాన్ని గురించి ఆలోచిస్తూ ఆరోజు శనివారమన్న మాట మర్చిపోయినందుకు నాలో నేనే నవ్వుకుని "నిజమే. ఇవ్వు." అన్నాను. సాయిబు సంతోషిస్తూ "మరో రెండువందలకంటె యెక్కువ లేవుబాబూ ఎదోయిచ్చి మొత్తం తీసుకోండి." అన్నాడు. జేబులో చూచుకుంటూ "ఇంక చిల్లర లేనట్లుందే!" అన్నా. "లేకపోతే రేపివ్వచ్చు. రోజూ వుండే బేరమేగా బాబూ! తీసుకువెళ్లండి." ముసలిసాయిబు తృప్తిగా నవ్వుతూ పూల నన్నిటి చక్కని కాగితంలో పొట్లంకట్టి చేతికిచ్చాడు. పూలపొట్లాం చేతపట్టుకుని మళ్లా నడక ప్రారంభించాను. సంక్రాంతి దగ్గరకు వస్తోంది. ఈసారి విజయకు యేదయినా ప్రత్యేక బహుమానం ఇవ్వాలి. సంక్రాంతి ఆమె పుట్టిన రోజవటం ప్రత్యేక విశేషం. క్రిందటిసారి అమ్మదగ్గరేవుంది. సంక్రాంతి నాడు కొత్త బట్టలు కట్టుకుని అమ్మ చేయించిన రాళ్లబిళ్ళ జడమధ్యలో పెట్టుకుని, తల నిండా సన్నజాజి పూల పరిమళం నింపుకుని ఆరుబయట వెన్నెల్లో పడుకునివున్న నా దగ్గరకు వచ్చి "ఈ వేషం చూచారా?" అన్న విజయ రూపం నా కళ్ళముందు మెదిలింది. ఆనాటి విజయలో నూతన వధువులో గల ముగ్ధత్వం ఇంకా పోలేదు. ఆనాటి విజయకి యీనాటి విజయకి గల వ్యత్యాసాన్ని వూహించుకుంటూవచ్చి ఇంటిముందాగాను. ఒక్కొక్కళ్లకి ఒక్కొక్క వస్తువు అంటే యెందువలన అంతటి అపేక్ష కలుగుతుందో? ఆడవాళ్ళు చాలామంది గులాబీలు, మల్లెపూలు అంటే యిష్టపడటం చూచాను. కాని విజయకు సన్నజాజులంటే ప్రాణం.

యద్దనపూడి సులోచనారాణి

ఈ రోజు అనుకున్న దానికంటె యెక్కువ పూలున్నాయి. పూలు చూచినప్పుడు సంతోషంలోని జయ మొహంలో ఆనంద రేఖలు యెలా వెల్లివిరుస్తాయో వూహించుకుంటూ ఇంటి గుమ్మం యెక్కాను. అంతవరకూ తీయనితలపు లూరించుకుంటున్న నా మనసు తాళంవేసిన ఖాళీగుమ్మం స్వాగతం చెప్పేసరికి ఒక్కసారి ముడుచుకుపోయింది. మనసులో అంతకు ముందున్న ఆనందం, అనురాగం పోయి వాటి స్థానాన్ని, విసుగు, అలసట వచ్చి నిలబడ్డాయి.

నన్ను చూచి కాబోలు యింటివారమ్మాయి సుగుణ పరుగెత్తుకుంటూ వచ్చి తాళం చెవి యిచ్చింది.

"మీ అక్క యెక్కడకు పోయింది? నీకు తెలుసా?" అన్నాను తాళంచెవి తీసుకుంటూ. "ఊహు నాకు తెలియదు. అమ్మకిచ్చి వెళ్ళింది" అంటూ సుగుణ వెనక్కు తిరిగి బాణంలా పరుగెత్తుకుంటూ పోయింది. తాళంతీసి లోపలకు వెళ్ళి చేతిలో పూల పొట్లాం డ్రాయరుమీదకు విసిరి స్టాండ్ మీద తువాలు తీసుకుని దొడ్లోకి వెళ్ళాను. కాళ్ళూ, చేతులు, మొహం తుడుచుకుని వచ్చి హాల్లో ఫ్లాస్కు కోసం వెతికాను. ఆఫీసునుంచి యింటికి రాగానే కాఫీ తాగటం అలవాటు. ఒకవేళ విజయ అవసరమొచ్చి యెక్కడికైనా వెళ్ళవలసి వస్తే కాఫీ కాచి ఫ్లాస్కులో పెట్టి నా అవసరాలన్నిటిని సిద్ధపరచి వెళ్ళటం పరిపాటి. కాని ఈ రోజున దానికి వ్యతిరేకంగా జరిగింది. విజయమీది విసుగు కోపంగా మారింది. వంట ఇంట్లోకి వెళ్ళి చూచాను. అలమరలో ఖాళీ ఫ్లాస్కు నన్ను చూచి నీరసంగా నవ్వింది. కాఫీకూడ కాచకుండా వెళ్ళవలసినంత అర్జంట్ పని యేమొచ్చిందో? ఏముంది యే నీరజో వచ్చి రమ్మనివుంటుంది. వెళ్ళిందిగాబోలు! స్నేహితురాలి మోజులో భర్తనిగూడా మర్చిపోయే మనుషుల్ని యేమనాలి? సగం విసుగుతోనూ, సగం కోపంతోనూ వచ్చి హాల్లో కుర్చీలో కూలబడ్డాను. సాంధ్యచీకట్లు దట్టంగా అలుముకున్నాయి. ఇల్లంతా చీకటిగావుంది. లేచిలైటు వేశాను. మళ్లా కుర్చీలో కూర్చోబోతుండగా యెదురుగుండా టేబిల్ మీద యేదో కవరు కన్పించింది. చెయ్యిచాచి తీసుకొని పై అడ్రస్ చూచాను. అది నాదే. వ్రాతగూడా చిరపరిచితమే. నా బాల్యమిత్రుడు జయపాల్ వ్రాతలాగుంది. వాడి దగ్గరనుంచి వుత్తరంవచ్చి చాలా రోజులయింది. వాళ్ళావిడకు వంట్లో బాగుండక పోవటంవల్ల పెళ్ళికికూడా రాలేదు. యేం వ్రాశాడో అనుకుంటూ కవరు చూశాను. చించేవుంది. చదివిందిగాబోలు. అనుకుంటూ లోపల కాగితాన్ని తీసి చదవటం మొదలు పెట్టాను. ఉత్తరంచదువుతుంటే నాలోవున్న విసుగు అలసట ఒక్కసారి మాయమయినాయి. ఉత్తరంవ్రాసిన పద్ధతిచూస్తే నాకు నవ్వాగిందికాదు. వాడేవో బాగా పైత్యంలో వుండి వ్రాశాడని అనుకుంటూ వచ్చేనవ్వు పైమీద తువాలుతో అపుకుంటూ వుత్తరం మరోసారి చదివాను. అందులో ఇలావుంది:

మహారాజశ్రీ

రాజశేఖరరావుగారికి వినయ పూర్వక నమస్కారములు. మీరు నాకుచేసిన వాగ్దానాలలో ఒక్కటి గూడా నిలబెట్టలేదు. ఈ వూరునుంచి వెళ్ళిపోయిన తర్వాత మీరు ఒక్క వుత్తరం గూడా వ్రాయలేదు. కారణం నాకు తెలియదు. నాకుచాలా గాభరాగా వుంది. మీరు నన్ను మర్చిపోలేదని పనుల తొందరలో వున్నారనే నమ్మకంతో వున్నాను నాకెప్పుడూ మీరే గుర్తొస్తారు. మీతోటి స్నేహం, ఆటలు...మరువలేనివి. ఈమధ్య యెవరో మీకు వివాహమైందని అన్నారు. ఆవార్త విన్నప్పటినుంచి నా గుండెల్లో ఆటంబాంబులు పేలుతున్నాయి. మీరు నాకు యిన్నాళ్ళనుంచి ఒక్క వుత్తరంగూడా వ్రాయకపోవటానికి కారణం యిదేనా అనిపిస్తోంది. అయినా నమ్మలేకుండా వున్నాను. మీరునాకు అన్యాయం చెయ్యరని నన్నుమీరు మర్చిపోలేదని నా అంతరాత్మ పదేపదే చెబ్తోంది. ఆధైర్యంతోనే యీ వుత్తరం వ్రాయటానికి సాహసిస్తున్నాను. మన ప్రేమసంగతి మానాన్న అమ్మలతో చెప్పాను. మీరేనా జీవితం అని అన్నాను. వారు మొదట్లో దిగ్భ్రమచెందినా తర్వాత మన్నించి మీకు వుత్తరం వ్రాయటానికి అనుమతి యిచ్చారు. ఈ వుత్తరం చూచిన వెంటనే మీరు బయలుదేరిరండి, లేకపోతే అమ్మా, నాన్నా నేను చెప్పింది అబద్ధమనుకుంటారు. మీరు నిజంగా పెళ్ళిచేసుకోలేదని, నన్ను మోసంచెయ్యరనే గట్టినమ్మకంతో వున్నాను. నా ఆశలన్నీ మీమీదనే వుంచుకున్నాను. ఒకవేళ మీరు గనక నిజంగా పెళ్ళిచేసుకునేవుంటే ?!...యేం చెయ్యాలో నాకు తోచదు. అప్పుడు నాకు మరణమే ఆశ్రయదాత అవుతుంది. ఆడపిల్లని ఇంతకంటె యేంచెప్పగలను. నా మనసులో బాధ అర్థంచేసుకోండి. మీ రాకకోసం నేనేగాదు నా తలితండ్రులుగూడ యెదురు చూస్తున్నారు. అమ్మా నాన్నముందు నన్ను అసత్యవాదినిగా నిలబెట్టకండి. నేనా అవమానాన్ని సహించలేను. ఈదీనురాలిమీద దయ యుంచండి. మీకు కవిత్వభాషలో వుత్తరం వ్రాయటానికి నాకు బాగా చదువురాదన్న విషయం మీకు తెలుసుగదా! యెంతో శ్రమపడి యీ వుత్తరం వ్రాస్తున్నాను. తప్పులుంటే క్షమించండి.

ఇట్లు,
మీరాకకోసం, హృదయమంతా,
కళ్లుచేసుకుని యెదురుచూచే అభాగిని

జయప్రా లు.

వచ్చే నవ్వుని అతికష్టంమీద ఆపుకోవాల్సి వచ్చింది.వీడెప్పుడూ యింతే. బి. ఎ. చదువుతుండగా ఒకసారి వేసంగిలో శలవులకు యింటికి వెళ్తే అచ్చు ఆడపిల్ల వ్రాసినట్లు చక్కటి ప్రేమలేఖ సృష్టించి వ్రాశాడు. అది అమ్మచూచి ఒకటే గొడవ. చెప్పేది వినిపించుకోదు. ఒకటే యేడుపు; ఉపవాసాలూను. అగ్నిహోత్రంలాంటి పవిత్రమైన మీ నాన్నగారి పేరుకు కళంకం తెస్తున్నానా అని యేడ్చింది. చివరికి ఆ వుత్తర్కం వీడు రాసిందే నని నమ్మించేసరికి తలప్రాణం తోకకు వచ్చింది. ఫలితంగా వెంటనే విజయతో పెళ్లి అయిపోయింది. పెళ్ళయిన తర్వాత జయపాల్‌ని అభినందిస్తూ వుత్తరం వ్రాశాను. సరిగ్గా ఆ సమయంలోనే వాడి భార్య మణికి పెద్ద జబ్బు చెయ్యటం మూలాన పెళ్ళికి రాలేకపోయాడు. నిజంగా యీ వుత్తరం చూస్తే యెంతటి వాళ్లకైనా అనుమానమేస్తుంది. ఇంతకీ విజయ యీ వుత్తరంచూసి యేమనుకుందో? ఈ ఆలోచన వచ్చేసరికి నాలో ఉన్న ఆనందమంతా గాలిలో దూదిపింజలాగ ఒక్కసారి యెగిరి చక్కాపోయింది. నా నవ్వు మీటనొక్కినట్లు ఆగిపోయింది. ఇలాటి వాటిల్లో ఒక దెబ్బతిని వున్నాను. చిన్నప్పటినుంచి తన చేతుల మీద పెంచి నా స్వభావాన్ని అర్థం చేసుకున్న అమ్మే పొరపాటుపడింది. కొంపదీసి విజయగూడా అలాటి అనుమానం పొందలేదు గదా! యేమో ఖర్మ. విజయ వెళ్లిపోవటానికి కారణం ఇదేఅయితే చచ్చానన్నమాటే. ఇది అబద్ధమని నిరూపించుకునేందుకు నా వద్ద

★ అర్థాంగి అలుక ★

మరో నిదర్శనంగూడా లేదు యిప్పుడు. నామనసు కొంచంగా చెదిరింది. ఆవేళంలో విజయ వుచితానుచితాలు తెలుసుకోదు. ముక్కుకు సూటిగాపోయి యేదితోస్తే అది చేసెయ్యటమే. అనుకోకుండా పెండ్లినాడు మామగారుచెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి. "నాయినా! భగవంతుడు జయలో ఆవేశం ఒక వీసంపాలు యెక్కువగా కలిపాడు. దానికి చాలా ఒడిదుడుకుల స్వభావం. కోపం వచ్చిందంటే తను వెళ్ళే మార్గంలో యేముందో గూడా చూచుకోదు. దాన్ని అర్థం జేసుకోగలిగి దాని నడతను విపులంగా చూచినటయితే నిన్ను మించిన అదృష్టవంతుడు ప్రపంచంలో మరోడు వుండడు. జాగ్రత్త నాయినా. జ్ఞాపకముంచుకో!" బాగా రాత్రి అయింది. ఇప్పుడెప్పుడు వస్తుంది? యెప్పుడు వంటచేసి నాకు భోజనం పెట్టుంది? అనుకుంటూ చేతినున్న వాచీ తీసి డ్రాయరుమీద పెట్టటానికి లేచి డ్రాయరుకు దగ్గరగా వెళ్లాను. మామూలుగా నా వాచీ పెట్టేచోటులో విజయ నోట్ బుక్‌లోని బ్లాపేపరు యెత్తు పెట్టబడి వుంది. మనసు అపశకునాన్ని శంకిస్తుండగా చేత్తో కాగితం తీసుకుని చూచాను. నా కళ్ళు నేనే నమ్మలేకపోయాను. లైటు ముందుకొచ్చి వెడల్పయిన కళ్ళతో వుత్తరం మరోసారి చదువుకున్నాను. అందులో సంబోధనాగింబోధనా ఏమీ లేదు. వ్రాతగూడా యేమంత బాగాలేదు. ఇలా వుంది.

"అదృష్టవశాత్తు వుత్తరం నేనేముందు చూడటం తటస్థించింది. మీరు నన్ను చూచినప్పుడు ఆరోజున నాన్నగారితో విజయ అన్నపేరు నన్నుబాగా ఆకర్షించింది అని యెందుకుచెప్పారో యిప్పుడు బాగా అర్థమౌతోంది. పాపం! అమాయకురాలు జయ మీకింకా పెళ్ళికాలేదని అనుకుంటోందిగాబోలు. తన ప్రాణసమానంగా ప్రేమించి తను యెదురుచూస్తున్న వ్యక్తి మరోవ్యక్తిని వివాహమాడి సర్వసుఖాలు అనుభవిస్తున్నాడంటే యేఆడపిల్ల హృదయం దహించుకుపోదూ? ఒకరోజున ఆ పిచ్చిపిల్లతో గూడా జయఅన్న పేరు నన్ను బాగా ముగ్ధుడ్ని చేసిందని చెప్పేవుంటారు. అందులో సందేహం లేదు. భగవంతుడు ఆడవాళ్ళకెన్ని తెలివితేటలిచ్చినా సులభంగా మగవాళ్ళ వలలో పడేటట్లు శాపంపెట్టాడుగాబోలు. నేను చదువుకున్నదాన్ని. నన్ను నేను జీవితాంతం పోషించుకోగల సమర్థత నాలోవుంది. ఆసమర్థతలేని జయ మీదయాధర్మంకోసం పాకులాడుతోంది. అందువలనే నేను మిమ్మల్ని ఆ నిర్భాగ్యురాలికి వదిలేసి వెళ్లిపోతున్నాను. మీరు యింకనైనా బుద్ధితెచ్చుకుని ఈరాత్రి రైలుకువెళ్ళిపోయి ఆ అమ్మాయిని క్షమార్పణకోరుకోండి. నిజంగా ఈ వుత్తరం నా చేతిలో పడటం ఆమెకు క్షేమకరమే అయింది. లేకపోతే నాకు తెలియకుండానే నేను ఒక అమాయకపు జీవికి తీరని అన్యాయం చేస్తూ వుండేదాన్నేమో! పాపం! ఎక్కువ చదువు గూడా చదువుకోలేదుట. మీరు తప్ప ప్రపంచంలో మరో ఆధారం వుండివుండదు. మీరు వెళ్ళలేకపోతే తన నిండుప్రాణాల్ని...... తర్వాత యేం జరుగుతుందో నేను వ్రాయలేను. మీరు ఊహించలేనంతటి మూర్ఖులు కారు. అది తలచుకుంటే నా కలం కంపిస్తోంది. చెయ్యి ముందుకు సాగటం లేదు. ఇంతకంటే వ్రాయలేను. మరో విషయంలో అయితే మీకోసం ఎంతో ఏడ్చేదాన్ని. దాన్నుండి రక్షించుకుని మిమ్మల్ని నా గుండెలు చీల్చుకుని అందులో భద్రముగా యెవరూ చూడకుండా దాచేసుకునేదాన్ని. కాని ఈ విషయంలో అలా చెయ్యలేను. పట్టపగలు పదిమందిని ఖూనీచేసి వచ్చినా మిమ్మల్ని క్షమించగలిగేదాన్ని. ఈ విషయంలో చెయ్యలేను. తను మనసారా ప్రేమించి తన సర్వస్వం అని నమ్మకున్న మగవాడు వుత్త మోసగాడయితే స్త్రీ ఎంత బాధ పడుతుందో నా యీ యిప్పటిబాధ తెలుస్తోంది. అందుకనే నేను జయ వుత్తరం చూడగానే జయమీద మండి పడలేకపోయాను. ఆమెబాధ నర్థంచేసుకునే నేను వెళ్లిపోతున్నాను. మీరింక నా ఛాయలు చూడటానికిగూడా ప్రయత్నించవద్దు. ఇది నాఆజ్ఞ. నా మీద యే కొస్త మమకారంవున్నా ఇది పాలించండి. ఒక గోముఖ వ్యాఘ్రానికి నా జీవితం అర్పించుకున్నా నన్న బాధ తప్ప ప్రస్తుతం నాలో యేమీ లేదు. మీరు వెంటనే వెళ్ళండి. ఆలస్యం చేసి మరో ప్రాణిలోవున్న విశ్వాసం పోగొట్టుకోకండి. నాయీ అవస్థ ప్రపంచంలో మరే యువతికి కల్లోగూడా కల్గించవద్దనిభగవంతుని ప్రార్థిస్తూ ముగిస్తున్నాను.

ఇట్లు,
విజయ.

మరో సమయంలో అయినట్లయితే ఆ వ్రాతకి మనసారా విరగబడి నవ్వుకునేవాడిని, కాని ఇప్పుడలా నవ్వలేకపోగా నరాలు పిండుతున్నట్లుగా విపరీతమైన బాధతో ఒక చిన్న మూలుగు నా హృదయాన్ని చీల్చుకుంటూ బయటకు వచ్చింది.

విజయ కోపగించుకుని వాళ్ళక్క గారింటికి వెళ్ళిపోయిందనటంలో యేమాత్రం సందేహం లేదు. ఈ వేళ లేచి యెవరి మొహం చూశానురా భగవంతుడా అనుకున్నాను. ఇంక యిప్పుడు అక్కడికి వెళ్లి చేసేది గూడా లేదు. తెల్లవారితే విజయలోవున్న వుద్రేకం గూడా తగ్గుతుంది. అప్పుడు అసలు విషయాన్ని విశదంగా చెప్పవచ్చు అనుకుని వూరుకున్నా. లేచి వుత్తరం డ్రాయరుమీద పడేసి వెనక్కు తిరిగా. ఒక్కసారి సన్నజాజుల పరిమళం గుప్పుమని గదంతా చుట్టేసింది. విజయ వచ్చిందా అనిపించింది. నా పిచ్చిగాని విజయ యెందుకు వస్తుంది.? డ్రాయరు మీద పొట్లాంలో వున్న పూలు విచ్చి తమ సౌరభాన్ని దాచుకోలేక గదంతా విరజిమ్ముతున్నాయి. క్షణంసేపు వాటి వంక చూచాను. అవి తన్ను వెక్కిరిస్తున్నట్లుగా కన్పించింది. మరుక్షణంలో పొట్లాం ఆవిధంగానే రెండు చేతులతోనూ నలిపేసి వీధిలోకి గిరాటుకొట్టి గబగబా తలుపులు వేసి హోటల్ వైపు నడక సాగించాను.

మర్నాడు వుదయం మా వదినగారింటికి వెళ్ళాను. బయట ఎనిమిదేళ్ళ రఘు ఆడుకుంటూ కన్పించాడు. నన్ను చూడగానే 'బాబాయ్' అంటూ పరుగెత్తుకొచ్చాడు ఎత్తుకుని ముద్దుపెట్టుకుంటూ "పిన్ని వచ్చిందా?" అన్నాను. వాడు వచ్చిందని తలూగిస్తూ "బాబాయ్! మరే నా పిల్లిపిల్లని రోజాకుక్క చంపేసింది." అన్నాడు యెంతో దుఃఖపడ్తూ. వాడిని ఓదారుస్తూ మెట్లెక్కి లోపలకువచ్చి హాలులో కూర్చున్నాను. లోపలనుంచి విజయకంఠం విన్పిస్తుందేమోనని ఆశించాను. కాని నాకు ఆశాభంగమైంది. కాసేపు రఘుతో ఖబుర్లుచెప్పి వాడిని "లోపలకువెళ్ళి మీ పిన్నిని ఒకసారి పిల్చుకురా" అన్నాను.

"నువ్వు వచ్చావని చెప్పనా?"

వద్దన్నట్లు సూచించాను. వాడు తూనీగలాగ లోపలకు తుర్రుమన్నాడు. రాబోయే విజయకు ఎలా శాంతిస్వరంతో నచ్చచెప్పాలో ఆలోచించుకుంటున్నాను. ఇంతలో రఘు విజయ చెయి పుచ్చుకుని లాక్కొచ్చి తప్పట్లు కొడూ నవ్వాడు. ముందట నేననుకోలేదు గాబోలు విజయ క్షణంసేపు తెల్లబోయి వెంటనే వంగి రఘు వీపుమీద ఒక్కటి చరిచింది. దెబ్బచురుకుగా తగలటంవల్ల వాడు బిక్కమొహం వేసి నావైపు చూస్తూ ఏడుపు సాగించాడు.

"పొరపాటు పడ్డావని చెప్పటానికి వచ్చాను" లేచివచ్చి రఘును ఎత్తుకుని సముదాయిస్తూ అన్నాను. విజయ కళ్లు నిప్పులు కక్కుతున్నాయి.

"నేనేం పొరపాటు పడలేదు. నాకంతా

మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి [ద్రాక్షారామం]
—ఫోటో : వి.ఆర్. శ్రీపతి.

బాగా తెలుసు. మీ నాటకం ఇంకా ఆడదామని చూడకండి" నా చేతుల్లోంచి రఘుని ఒక్కగుంజుతో లాక్కుంది.

"విజయా!"

నామాట విన్పించుకోకుండానే రఘు వీపుమీద మరోటి అంటిస్తూ "వెధవా! ఇప్పటినుంచి అబద్దాలాడటం నేర్చుకుంటేగాని రేపు పెద్దపెద్దవాళ్ళ గొంతులు కొయ్య లేవు." అంటూ లోపలకు వెళ్లిపోయింది.

"విజయా!" ఆవేశంలో బిగ్గరగా అన్నాను. ఎవరినుద్దేశించి ఆవిధంగా వ్యంగ్యంగా మాట్లాడిందో అర్థంచేసుకున్న నేను ఇంక అక్కడ నిలబడలేక వెనక్కు తిరిగి వచ్చేశాను. ఆదివారం కావటం ఈరోజు ఆఫీసు కూడ లేదు.

ఇంటికొచ్చి మౌనంగా కుర్చీలో కూర్చుని జరిగినదంతా ఒక్కసారి విమర్శించుకున్నాను. ఇందులో నేను చేసిందేముంది? నాపాత్ర నిమిత్తమాత్రంగా నిలబడింది. ఆసమయంలో జయపాల్ కన్పిస్తేనా ఏం చేసేవాడినో అనిపించింది. ఇల్లంతా బావురుమంటోంది. ఎక్కడి వస్తువులు అక్కడ లేక చిందరవందరగా పడివున్నాయి. రాత్రి కోపంతో నలిపి పారేసిన పూలు ఒకటి రెండు వాడిపోయి ఎండిపోయి క్రిందపడి వున్నాయి. డ్రాయరు ముందు కుర్చీలో కూర్చుని జయపాల్‌కి ఈ విధంగా వుత్తరం వ్రాయటం మొదలు పెట్టాను :

జయపాల్,

హాస్యపూరితంగా నువ్వు వ్రాసిన వుత్తరం అందింది. కాని అది మొదట నాకు అందలేదు. ఎవరికందాలో వారికే అందింది. ఆవిధంగా అందటంవల్ల కలిగిన ఫలితం వింటే నువ్వు బహుశా నిద్రాహారాలు గూడా మర్చిపోతావు. ఒకనాడు నీమూలంగానే-అంటే నీ వుత్తరం మూలంగా-నేను విజయను పెళ్ళాడటం జరిగింది. ఆనాడు నేను అమ్మదగ్గర వుండగా నువ్వా విధంగా ప్రేమలేఖ వ్రాయకపోయినట్లయితే నేను విజయను వివాహమాడటం సంభవించేదిగాదు. కాని మళ్లా నీ వుత్తరం మూలంగానే విజయ నానుండి దూరమైపోవటం వింతగా లేదూ! ఎరుగని వాళ్ళు నీ వుత్తరం చూస్తే ఏ ఫలితాలు కలుగుతాయో అవే కలిగాయి! విజయకు నువ్వు తెలియవు. నన్నపార్థంచేసుకుని కోపగించి నామీద అలుకతో వాళ్లక్క గారింటికి వెళ్ళిపోయింది ఇప్పట్లో విజయదగ్గరకు నేనువెళ్ళినా ప్రయోజనం లేదు. జయపాల్! నామీద విజయకెంత అసహ్యం పుట్టిందంటే చివరికి నా మొహం చూడటానికి గూడా యేవగించుకుంటోంది. ఆమెయిహ నా దగ్గరగా రావటం దుర్లభమనే తలుస్తున్నాను. ఎందుకంటావా విజయ నన్ను దోషిగా నిర్ణయించుకుని వెళ్ళిపోయింది. నేను నిర్దోషినని నిరూపించుకునే ఆధారాలు నా దగ్గర లేవు. తమాషాగా వ్రాసిన వుత్తరం ఇంత దారుణఫలితాల నిస్తుందని నువ్వనుకుని వుండవుగదూ! కాని యేం చేదాం. ప్రతిది

★ అర్ధాంగి అలుక ★

మన మంచికోరకే అనుకుని వూరుకున్నా.

ఇట్లు, యేం చెయ్యాలో తోచని,
నీ, రాజు.

ఆరోజంతా అటూ యిటూ కాలు కాలిన పిల్లిలాగ తిరుగుతూ గడిపాను. ఆ రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు. ఇంత చిన్న విషయానికే విజయ నన్ను అనుమానించిందంటే నన్నసలు అర్థం చేసుకోలేదన్న మాట. నాయెదుట నిలబడి వుత్తరంలోని మాటలు నా మొహం మీద అంటే యెంతో సంతోషించే వాడిని. వాళ్ళక్కతో యేమని చెప్పిందో. భార్యాభర్తల మధ్య యేవైనా మనస్పర్థలు కలిగినా యిద్దరూ ముఖాముఖిని తేల్చుకోవాలిగాని యీ విధంగా చేస్తే కలిగే ప్రయోజనమేమిటి? పైగా అందరూ చూసి నవ్వడం తప్ప. ఇందులో నా తప్పేం లేదు. మొదట విజయే దూరంగా వెళ్ళిపోయింది కాబట్టి యేనాటికైనా తనంతటతనే తిరిగి క్షమించమని నా దగ్గరకు రావాలి. ఒక నిశ్చయానికి వచ్చిన తర్వాత నా మనసు తేలికపడింది. యే పొరపాటు చెయ్యని నేను వెళ్ళి క్షమించమని అడగవలసిన అవసరం నాకేమాత్రం లేదనిపించింది.

ప్రళయకాలంలో ముచ్చటగా మూడు రోజులు గడిచిపోయాయి. నాలుగోరోజున సూర్యోదయమైంది. ఈ రెండు మూడు రోజుల్లో నేను విజయను చూడటం గాని కనీసం ఆమెను గురించి వినటానికి గాని ప్రయత్నం చెయ్యలేదు.

పదిగంటలు దాటింది. ఆఫీసుకు వెళ్ళే ప్రయత్నంలో వున్నాను. ఇంటి ముందు జట్కా ఆగింది. ఒకసారి నా గుండెలు సంతోషంతో వువ్వెత్తున లేచాయి. బండిలోంచి దిగబోతున్న విజయను నేను గమనించనట్లుగా వుండాలని వీపు వీధివైపు పెట్టి నిలబడ్డాను.

"రాజూ!" ఆశించిన ఆశలు ఒక్కసారి కూలిపోగా వులిక్కిపడి వెనక్కి తిరిగి చూచాను. యెదురుగుండా గుమ్మంలో జయపాల్, అతని భార్యామణి నిలబడి వున్నారు. క్షణంసేపు నేను, జయపాల్ ఒకరి కళ్ళలోకి ఒకళ్ళం చూచుకున్నాం. అక్కడ మణి వున్న సంగతి కూడా మర్చిపోయి ఇద్దరం ఒకళ్ళనొకళ్ళు గట్టిగా కౌగలించుకున్నాము.

"నేను తమాషాకోసం చేసినపని యింత దారుణ ఫలితం కలగచేస్తుందనుకో లేదురా రాజూ" అన్నాడు గద్గద కంఠంతో. మూడురోజుల క్రితం గనక జయపాల్ నాకు కనిపిస్తే యేం చేసేవాడినో నాకే తెలియదు. కాని యిప్పుడా సమయం దాటిపోయింది.

"రండి లోపలికి" అన్నా గుమ్మంలో నిలబడిన మణిని చూస్తూ.

"అసలు జరిగినదేమిటో సరిగా వివరంగా చెప్పు" అన్నాడు జయపాల్ లోపలకు వచ్చికూర్చుంటూ. నేను జరిగినదంతా విపులీకరించాను.

"నేను వుత్తరం రెండోవైపున గ్రీన్ ఇంక్‌తో వ్రాశాను చూడలేదూ?" అన్నాడు జయపాల్ అంతా విన్న తర్వాత.

"ఊహు యేమని వ్రాశావు?" అన్నాను ఆశ్చర్యంగా.

"నేను వ్రాసిన పేపరు ఆకుపచ్చగా వుంది గదా. దానికి వెనకవైపున క్రిందుగా వుత్తరం చదివిన తర్వాత కలిగిన అనుభవం వ్రాయి అని వ్రాసి సంతకం చేశాను." అన్నాడు.

"నేను చూడలేదు. విజయకూడా చూసి వుండదు." అన్నాను.

"సరేమరి యీ గ్రంథమంతా ఎందుకు జరుగుతుంది, నీ వుత్తరం అందింది. మొదట నువ్వుకూడా తమాషాగా వ్రాశావేమో అనుకున్నాను. కాని వివరంగా చూస్తే అందులో తమాషా వున్నట్లు కల్పించలేదు. వుత్తరం చూచినప్పటి నుంచి మణి నన్ను ఒకటే సాధింపు, ఇక వెంటనే బయలుదేరి వచ్చాం. మా పినతండ్రికూతురు నీరజ యిక్కడేవుంది. అక్కడే దిగాము. సరాసరి యిక్కడికొద్దామంటే పరిస్థితులు తెలియవు గదా!"

(55-వ పేజీ చూడండి)

అందముగ మన్నే ఒక అందమైన చీర!

మీరు బిన్నీవారి అసలైన సిల్కు జార్జెట్ చీర కట్టుకుంటే ఎంతో అందముగ కనపడతారు. అది అసలైన సిల్కుతో నేయబడినది కనుక దాని మెత్తదనము మరియు సహజమైన తళతళ చాల కాలము ఉండును.

బిన్నీవారి అసలైన సిల్కు జార్జెట్ చీరలను ఎన్నోసార్లు యింటివద్ద ఉతుకుకున్నా అవి ఒంటి మీద అందముగ విలిచేలా ఉంటాయి. వాటి మనోహరమైన రంగులు పోవు.

అందముగ చాల కాలము మన్నే బిన్నీవారి సిల్కు జార్జెట్ చీరలను కొనండి!

బిన్నీవారి యితర సిల్కు చీరలు:

మెత్తని సిల్కు చీరలు: పుష్పదళమువంటి ఈ మెత్తని సిల్కు చీరలు, బంగారు అంచు మరియు సరిక్రొత్త డిజైనులతో తళతళలాడే రంగులలో దొరకుతున్నాయి. వీనిని యింటివద్ద ఉతుకుకోవచ్చును.

క్రేప్ సిల్కు చీరలు: ఈ క్రొత్త అందమైన, స్వచ్ఛమైన సిల్కు చీర నేత్రానందకరమైనది. అందమైన బంగారు అంచులు.

అసలైన బిన్నీవారి చీరలన్నిటిమీద బంగారు రంగులో యీ ముద్ర వేయబడియున్నది

బెంగుళూరు వులెన్, కాటన్ అండ్ సిల్కు మిల్స్ కంపెనీ లిమిటెడ్
మ్యానేజింగ్ ఏజెంట్లు:
బిన్నీ అండ్ కంపెనీ (మద్రాసు) లిమిటెడ్.

లోని శిడుగుపై గౌతమ బుద్ధుడు దండయాత్రకు బయలుదేరినది కూడా ఈ విజయదశమి నాడే.

భారతదేశాన్ని ముస్లిములు పూర్తిగా ఆక్రమించుకొన్నారు. సమర్థ రామదాసంతటి మహావ్యక్తి 'సాక్షాత్తు పరమేశ్వరుడవతరిస్తేతప్ప హిందూరాష్ట్రం రక్షింపబడే అవకాశంలేదు.' అని నిస్పృహతో అన్న రోజులవి. 1674 లో ఈ విజయదశమినాడే రాయఘడ్ దుర్గంలో శతఘ్నికొల్పులు జరిపించి విజయభేరి మ్రోగించి విజయయాత్ర నుపక్రమించాడు ఛత్రపతి శ్రీ శివాజీ.

విజయనగర సామ్రాజ్యాన్ని కబళించాలని సరిహద్దుల్లో పొంచికూర్చున్న బహమనీ రాజ్యాలపై మొట్టమొదటిసారిగా విజయయాత్ర నుపక్రమిస్తూ శ్రీకృష్ణదేవరాయలు సంప్రదాయాను సారం ఆయుధపూజలు గావించి సీమోల్లంఘనకు బయలుదేరడం గమనిస్తే ఈ విజయదశమి చారిత్రక కాలంలో కూడా యెలాంటి స్ఫూర్తినిస్తూ వచ్చిందో గ్రహించవచ్చు.

మైసూరు, ఢిల్లీ, కులూ లోయలలో ఈనాటికీ దసరా ఉత్సవాలు ప్రత్యేకతను కల్గివున్నాయి. 'కులూలోయ'లో కొండజాతుల వారి వేడుకలు కన్నులపండువుగా వుంటాయి. మైసూరులో గతవైభవ చిహ్నమైన రాజదర్బారు జరుగుతుంది. నాటి రాజనగరు, రాజఠీవి, రాజలాంఛనాలు, రాజరికపు ఉత్సవ సంరంభం ఒకనాడు దసరా పండుగను మనవారెంత గొప్పగా జరిపేవారో ఈనాటికీ తెల్పుతూవుంటాయి. పూర్వం యిక్కడ మల్లయుద్ధం పోటీలు జరిగేవి. వీరులకు సన్మానాలు జరిగేవి.

ఢిల్లీలో రామలీల అంటూ తొమ్మిది రోజులు ఉత్సవాలు జరుపుతారు దసరాకి. ఆఖరురోజున రావణ కుంభకర్ణుల బొమ్మలు బ్రహ్మాండమైన వాటిని తయారుచేసి వాటిని తగులబెట్టి పెద్దగా జయజయ ధ్వానాలు చేస్తారు.

దక్షిణాదిన దసరాకు బొమ్మల కొలువు పెడతారు. పూర్వం విజయ యాత్రానంతరం తమవారుతెచ్చిన సంపదను, విశిష్ట వస్తు సంచయాన్ని ప్రదర్శించేవారు. బహుశా దాని ప్రతిరూపంగా ఈ బొమ్మల కొలువు నేటికి మిగిలిందేమో! మహారాష్ట్ర ప్రాంత గ్రామీణ యువకులు చిన్న చిన్న ఆయుధాలతో వీరులవలె నటిస్తూ పొలిమేర దాటడం ఈనాటికీ చూడ ముచ్చటగా వుంటుంది. విజయనగరంలో దసరా ఉత్సవాలకంటూ ప్రత్యేక రంగస్థలం వుండేది. అదే ఈనాడు "దసరా దిబ్బ"గా ఆ శిధిలాల్లో వుండి గతవైభవాన్ని గుర్తుకు తెస్తూ ఉంటుంది. ★

అర్ధాంగి అలుక ★

(24-వ పేజీ తరువాయి)

"నీరజ అంటే చంద్రశేఖరం పెళ్ళామేనా?" అన్నాను.

"అవును." అన్నాడు.

"నీరజకి విజయకు ప్రాణస్నేహం" అన్నాను.

"రైట్!" జయపాల్ కుర్చీలోంచి లేచి ఒక్క గంతువేశాడు. నేను, మణి తెల్లబోయి చూచాం.

"సరే! నువ్వుమధ్యాహ్నం ఆఫీసుకు శెలవు పెట్టేసెయ్యి." అన్నాడు.

"యెందుకు?" అన్నాను.

"యెందుకంటూ వేమిట్రా ప్రాణస్నేహితుడు వస్తేనూ?" సీరియస్‌గా అన్నాడు. నేను శెలవుపెట్టటానికి ఒప్పుకున్నాను.

"సాయంత్రం నాలుగింటికి నువ్వు నీరజగారింటికిరా! తెలుసుగా" అన్నాడు.

"యెందుకని అడగాలని నోటిదాకా వచ్చినా వాడిమొహంలో గాంభీర్యం చూసి వూరుకున్నాను. కాసేపుండి వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

భార్య వుండి ప్రాణస్నేహితుడు వస్తే ఇంటికి పిలవలేకపోయానని మహాబాధపడ్డాను. వాడికి మాట యిచ్చినట్లుగా నే ఆ సాయంత్రం నాలుగింటికి నీరజగారింటికి వెళ్ళాను. ఇల్లంతా ఏదో హడావుడిగావుంది. చంద్రం వాకిట్లో నే నాకు యెదురై "రండి! రండి! ఇవాళ మా అమ్మాయి పుట్టినరోజు. టీపార్టీ" అన్నాడు.

పిలవని పేరంటానికి వచ్చిన నేను అభిమానంతో తలదించుకున్నాను. ఇంతలో జయపాల్ యెదురై నన్ను లోపలకు లాక్కెళ్ళాడు. నన్నొక గదిలోకి తీసుకెళ్ళాడు. ఆ గది కొంచెం విశాలంగా వుండి పది పన్నెండు మంది కూర్చుని కాఫీలు త్రాగేటందుకు వీలుగా టేబులు వాటి యెదుట కుర్చీలూ అమర్చబడివున్నాయి. యెదురుగుండా గోడకు దగ్గర ఆ చివరనుంచి యీ చివరకు నీలం దాని మీద యెరుపు పూలద్దిన కర్టెన్ బిగించబడివుంది. జయపాల్ నన్ను చెయ్యి పుచ్చుకుని ఆ కర్టెన్ దగ్గరకు లాక్కువెళ్ళి "రాజా! లోపల కుర్చీవుంది. అక్కడ కూర్చో" అన్నాడు "ఎందుకు?" అన్నాను అర్థం గాక.

"అబ్బ! నీ ఎందుకూలతో చంపకురా నాయినా. నా మాట విని తెర అవతల రాజాలా గపడుకుని తెర యివతల జరిగే నాటకం విను. ఈ పుట్టిన రోజూ గిట్టిన రోజూ అన్నీ అబద్ధాలే. కేవలం విజయను ఇక్కడకు ఆహ్వానించటం కోసం నీరజతో కలిసి యీయెత్తు యెత్తాం. అంతా వింటూ వుండు నీకే తెలుస్తుంది" అన్నాడు కర్టెన్ ప్రక్కకు లాగి నన్ను తీసుకెళ్ళి కుర్చీలో కూలద్రోసి "నువ్వవతలవాళ్ళకి కన్పించవు నీకు అవతలవాళ్లు కన్పించరు." అన్నాడు.

"మధ్యలో యెవరయినా యీ కర్టెన్ లాగితే ఇందులోంచి బుద్ధదేవుడి లాగ నేను బయటపడితే?" సందేహంగా చూస్తూ అన్నాను.

"అయితే, గియితే. మహా సందేహపు మనిషివిరా నాయినా. నాకళ్లురెండూ యీ కర్టెన్ మీదే వుంటాయి. భయపడకు" అన్నాడు.

"నాకేదయినా అవమానంలాటిది జరిగితే ఇంక నన్ను నువ్వు పట్టలేవు ముందే చెప్తున్నా" అన్నా చికాకుగా మొహం పెట్టి.

"సరే! నాదిగాపూచీ నీకేం జరగకుండా" అని కర్టెన్ మూసేసి వెళ్ళిపోయాడు. ఇదంతా యేమిటని ఒక ప్రక్క కుతూహలంగా వున్నా మరో ప్రక్క యిలాగ కూర్చోటానికి విసుగ్గా వుంది. జేబులో సిగరెట్ పాకెట్ తీసి సిగరెట్ ముట్టించి పడక్కుర్చీలో వెనక్కు వాలాను.

గదిలోకి యెవరో వస్తున్నారు. పోతున్నారు. తమషా తమాషా సంభాషణలు విన్పిస్తున్నాయి. నాలో ఓపిక నశిస్తోంది. ఇంతలో "రా! విజయా! నీకోసమే చూస్తున్నాం" అన్న నీరజ కంఠం విన్పించింది. అడుగుల చప్పుడును బట్టి వచ్చిందని అనుకున్నా.

"ఈ విజయే అన్నయ్యా నీ ఫ్రెండ్ రాజా భార్య"

"ఇతను మా అన్నయ్య అంటే పెత్తండ్రి కొడుకు, జయపాల్. ఈవిడ మా వదిన మణి" పరిచయవాక్యాలు మహాపసందుగా వున్నా యనుకున్నా.

"నేను వస్తున్నట్లు టెలిగ్రామిచ్చాను. అందలేదాండి." అన్నాడు జయపాల్. విజయ తల తిప్పిందో యేమో శబ్దం మటుకు విన్పించలేదు.

"స్టేషన్‌కు వస్తాడని యెంతో చూశాం. కానీ రాలేదు. అసలు వూళ్ళో వున్నాడా లేదా?" జయపాల్ వాక్చక్యానికి మెచ్చుకోకుండా వుండలేక

అర్ధాంగి అలుక ★

పోయాను. దాన్నుంచి విజయ మళ్లా నిశ్బ్దంగానే జవాబిచ్చింది.

"అరె! వున్నాడా? మరి స్టేషన్‌కెందుకల్ల రాలేదో?"

"నేను చెప్పలా. మీరు వ్రాసిన వుత్తరం అతనికి కోపం తెప్పించివుంటుంది." ఇది మణికంఠం.

"యేవిటా వుత్తరం?" నీరజ కంఠంలో కుతూహలం కన్పిస్తోంది.

"మీరు చూశారా ఆ వుత్తరం?" బహుశా విజయనై వుంటుంది మణి ప్రశ్నించింది.

"యెందుకులే అని చూపించివుండరు. యింత స్నేహితులయితే మాత్రం మరీ అంత ఇదా. తనొక ఆడపిల్లలాగ తన్నేదో మోసం చేసినట్టుగా యేవిటేవిటో వ్రాశారు. ఇంకా నయమే. మీరు చూడలేదు గాబట్టి సరిపోయింది. లేకపోతే మా రాజుమీద తప్పకుండా అనుమానపడి పోట్లాట పెట్టుకునేవారు." అంది మణి. నాకాసమయంలో విజయ మొహం యెలావుందో చూడాలని మహా ఆసక్తి కలిగింది. కాని యేంచెయ్యను? కాసేపు మళ్లా ఆ ఖబుర్లు యీ ఖబుర్లు దొర్లిపోయినాయి. చివరికి విజయ "వస్తానండి" అంది. అమ్మయ్య ఇప్పటికి వినిపించింది అనుకున్నాను.

"మీరు ఒక చిన్నసాయం చేసి పెడ్తారా?" అన్నాడు జయపాల్.

"యేమిటది?"

"రాత్రికి మీయింటికి వస్తాం మేమిద్దరమూనూ. వాడితో యీ విషయమేమీ చెప్పకండి. హఠాత్తుగా కన్పిస్తాం. యేం చేస్తాడో చూడాలని అపేక్షగా వుంది" అన్నాడు.

"అలాగే"

"మరి అడ్రస్ చెప్పి వెళ్తారా?"

విజయ చెప్పి రమ్మనమని మణిని తనకి తనుగా మళ్లా ఆహ్వానించింది అందులో గల వుద్దేశం నాకు తెలియలేదు. క్రమంగా అందరూ వెళ్లిపోయారు. జయపాల్ కర్టెన్ లాగి "దయచెయ్యండి" అంటూ యువతలకు దారిచూపాడు. నా మొహంలో భావాలు దాచుకోవటం నాకు చాలా కష్టంగావుంది.

"సరాసరి యింటికి దయచెయ్."

"యెందుకు?" అలవాటుచొప్పున నోటినుంచి ప్రశ్న వచ్చేసింది. జయపాల్ నన్ను వురిమిచూచాడు. నేనేం చలించకుండా "సరే! సతీసమేతంగా మాయింటికి భోజనానికి దయచెయ్" అన్నాను. సరేనని అంగీకారం తెలిపాడు.

"కాని ఒక్క విషయం జయపాల్! నాకు నీకు మల్లే నటన చేతగాదు. ఇంటికి వెళ్లి విజయతో నువ్వు బజార్లో కనిపించావని చెప్తాను" అన్నాను. వాడు కాసేపు ఆలోచించి సరేనన్నాడు.

తర్వాత చెప్పవలసిం దేముంది? ఇంటికి వచ్చాను. విజయ మామూలుగా యింట్లో పనులు చూచుకుంటోంది. నేను తనను పలకరించకుండా వచ్చి నా గదిలో కూర్చున్నాను. కాసేపటికి విజయ కాఫీ తీసికొని వచ్చింది. ఈ మూడు రోజుల్నుంచి జరిగిన ప్రళయ తాండవమంతా బలవంతాన మర్చిపోయి వచ్చినట్లు మొహం స్పష్టంగా చెబుతూనే వుంది. కాఫీ కప్పు తీసుకుంటూ "నా స్నేహితుడు జయ, అతని భార్యా వచ్చారు. బజార్లో కనిపించితే మనింటికి రమ్మనమని చెప్పాను: ఇంకా హోటల్‌కి కబురు పంపుదామనుకుంటున్నాను. నువ్వు వచ్చావుగా" అన్నాను చాలా సహజంగా. క్షణంసేపు విజయ కళ్లెత్తి నా మొహంలోకి చూచి వెంటనే వెళ్లిపోయింది.

ఆ రాత్రి జయపాల్, మణి వచ్చారు. నేను విజయను యేమీ తెలియనట్టుగా పరిచయం చేశాను. మణి-విజయ చాల చక్కగా కలిసిపోయి వంట యింట్లోకి వెళ్లిపోయారు.

ఇద్దరం భోజనం చేస్తుండగా జయపాల్ ఇలా అన్నాడు: "ఆ కాస్త దానికే అంత కోపం యెందుకురా నామీద నేను నువ్వు రావటం మానేశావు. అయినా వెనక పేజీలో క్రింద చివర వ్రాశానుగా." అన్నాడు. ఈ మాటలు యే వుద్దేశంతో అన్నాడో గ్రహించుకున్న నేను మాట్లాడలేదు.

చాల్లెండి ప్రతాపం. మీ చెల్లెలు చూడలేదుగాబట్టి ఆ వుత్తరం సరిపోయింది. లేకపోతేనా?"

"మా చెల్లెలేం అలా చెయ్యదు తెలుసా?" జయ విజయ పక్షం వహించాడు. ఆ రాత్రి చాలా సరదాగా గడచిపోయింది.

ఆరాత్రి విజయ నా పాదాలమీద చేతులాన్చి కళ్ళనీళ్లతో "నన్ను క్షమించండి" అంది. నేను నా కాళ్ళు దూరంగా లాక్కుంటూ "ఉహు. నిన్ను క్షమించలేను విజయా. నాకోసం గాదు. ఆ రోజున రఘుని నామూలంగా వుత్తపుణ్యానికి కొట్టావు. అది నాకుయెంతో బాధ కల్గించింది తెలుసా?" అన్నాను.

"లేకపోతే యేమిటి చెప్పండి. నీరజ వచ్చింది. నిన్ను పిలుస్తోందని అబద్ధం చెప్పాడు, తీరాచూస్తే మీరు."

"నాకాసమయంలో నీమీద అంత కోపం వచ్చిందన్నమాట. అందుకనే వుత్తరంలో..."విజయ తన చేత్తో చటుక్కున నా నోరు మూసేసి "ఇంక ఆ విషయం యెత్తవద్దు." అంది. నేను చెయ్యి లాగివేస్తూ "యెత్తవద్దని అనటంమాత్రం అంటున్నావుగాని నేను యెంత బాధ పడ్డానో తెలుసా?" అన్నాను కోపంగా. విజయ యేడుస్తూ మోకాళ్లమీదవంగి "అంత్రా కె నన్ను క్షమించమంటున్నాను. ఇంక యిలాంటి తెలివి తక్కువ పనులు జీవితంలో చెయ్యను. ఈ ఒక్కసారి నన్ను క్షమించండి" అంది. వంచిన తల్లోంచి సన్నజాజుల పరిమళం నన్ను వుక్కిరి బిక్కిరి చేసింది. చేత్తో విజయను లేవనెత్తుతూ "చాల్లే. భగవంతుడు పురుషుల్లో అన్ని శక్తులు పెట్టాడుగాని ఆడదాన్ని కన్నీరుచూచి సహించగల మనస్తత్వం పెట్టలేదు. అందుకనే మగవాళ్ళెప్పుడూ మీ ఆడవాళ్ల ముందు వోడిపోతూవుంటారు" అన్నాను నవ్వుతూ.

జయపాల్ మణి మరి రెండురోజులున్నారు. నేను ఆఫీసుకు శలవు పెట్టాను. విజయ, మణి అక్కచెల్లెళ్లలాగ కలిసిపోయారు. ఆఖరికి వాళ్లు వెళ్ళిపోయే రోజున విజయ, మణి ఒకళ్లనొకళ్లు కావలించుకుని ఆనందబాష్పాలు రాలుస్తుంటే నాకు నిజంగా చాలా ఆశ్చర్యమేసింది. ట్రెయిన్ ఎక్కుతూ రహస్యంగా వాడిచెవులో యిలా చెప్పాను: "ఒకేయ్. జయపాల్ నీ వుత్తరాలు మొదట్లో ప్రళయకాలంనాటి సంఘటనలు సృష్టించినా తర్వాత చక్కని మార్గాలు ఏర్పరుస్తాయి. ఇప్పుడుచూడు. నీ వుత్తరంమూలాన ఇక విజయ నేను నిజంగా తప్పచేసినా నమ్మనంత విశ్వాసం నామీద యేర్పరుచుకుంది. దీనికి నేను నీకు కృతజ్ఞుడిని" అన్నాను.

"రాజూ! నీకంత మంచిపని చేసిపెట్టాను గాబట్టి నువ్వు నాకొక బహుమానం ఇవ్వాలి" అన్నాడు.

"ఏమిటది?" అన్నాను.

"సంక్రాంతికి మీ రుభయులూ మా వూరు రావాలి యేం విజయా?" ఈ మాటలు బిగ్గరగా అన్నాడు.

"ఆ రోజు విజయ పుట్టినరోజు గూడాను" అంది మణి.

"అయితే స్పెషల్ ప్రోగ్రాం ఇద్దాం. యేలోయ్ తప్పకుండా రావాలి." నేను విజయ మొహంలోకి చూచాను. ఆ కళ్లు అంగీకారం తెలిపాయి. జయపాల్ సంతోషంతో నా చేతిని ఆఖరుసారి గుంజాడు. రైలు కదిలింది. ఆ జంట అటువైపు వెళ్తుంటే మేం ఇటువైపు ఇంటికి బయలుదేరాం. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad